క్లుప్తంగా

రేపటి నుంచి మంగళంపల్లి జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి వేడుకలను ఈ నెల 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల ఆరో తేదీ సాయంత్రం శ్రీరామరస సరసి ఆధ్వర్యాన శివరామక్షేత్రంలో కస్తూరి గోపాలరావు గాత్ర కచేరి నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధానకార్యదర్శి డాక్టర్ సీఎల్వీ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వరఝరి ఆధ్వర్యంలో 7వ తేదీ సాయంత్రం గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై రాత్రి 7 గంటలకు బాలమురళీకృష్ణ శిష్యులు డీవీ మోహన కృష్ణతో గురు శిష్య సంబంధం– మురళితో అనుబంధం అంశంగా ఇష్టాగోష్టి ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు. బాలమురళితో అనుబంధం ఉన్నవారు, వారి శిష్య ప్రశిష్యులు పాల్గొంటారని వివరించారు.

జీజీహెచ్‌కు రెడ్‌క్రాస్ ఐదు వీల్‌చైర్‌ల వితరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నడవలేని రోగులను ఒకచోట నుంచి మరోచోటుకు తరలించడానికి ఉపయోగపడేలా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఐదు వీల్‌చైర్‌లను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అందజేశారు. రెడ్‌క్రాస్‌సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ శ్యామ్‌కుమార్, ఆర్ఎంఓలు నాగేశ్వరరావు, సూర్యమంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్వారీ సెంటర్‌లో విరిగిపడిన చెట్టు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారీ వర్షానికి గట్టు వెనుక క్వారీ సెంటర్‌లో మెయిన్‌రోడ్డుపై చెట్టు విరిగిపడింది. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో కురిసిన భారీ వర్షం, గాలులకు క్వారీ సెంటర్ సాయిబాబా గుడి వీధి ఎదురుగా ఉన్న చెట్టు ఒక సారిగా పెద్ద శబ్దంతో విరిగిపడింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గంట తర్వాత వాన తగ్గుముఖం పట్టడంతో రోడ్డుపై పడిన చెట్టును హుటాహుటిన తొలగించిన వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

అఖండ సాయినామ సప్తాహ పరిసమాప్తం



భవానీపురం(విజయవాడపశ్చిమ): గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక పాత హౌసింగ్ బోర్డ్‌కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన ద్వాదశ సప్తాహ వేడుకల్లో భాగంగా మంగళవారం 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అనే అఖండ సాయినామ సంకీర్తన సప్తాహం పరిసమాప్తి అయ్యింది. తొలుత సాయినాథునికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో సహస్ర నామార్చన జరిగింది. గురుపౌర్ణమి ద్వాదశ సప్తాహ వేడుకలు ముగిసినట్లు మందిర పాలక మండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమాలను పాలకమండలి ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట మహేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రశాంత జీవనానికి సహకరించండి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రశాంత జీవనానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, రోడ్లపై తిరుగుతూ మహిళలు, యువతులను వేధింపులకు గురి చేసే ఆకతాయిలపై పోలీసులకు సమాచారం తెలపాలని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని కోమలవిలాస్ అడ్డరోడ్డు, సుబ్రహ్మణ్యస్వామి గుడి పరిసరాల నుంచి ప్రారంభమైన ఫుట్ పెట్రోలింగ్ టీనర్‌పేట అడ్డరోడ్డు, కలరా హాస్పటల్, లంబాడీపేట, ఎస్ఏఎస్ కళాశాల వరకు సాగింది. అడ్డరోడ్డులో ఎదురయ్యే సమస్యలను సీఐ సుబ్రహ్మణ్యం తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళ గస్తీని పెంచాలని మహిళలు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. ఫుట్ పెట్రోలింగ్‌లో క్యూఆర్‌టీ, టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ పోలీసు బృందాలు పాల్గొన్నాయి.

పేదల కోసం పోరాడిన రంగా

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పేదల కోసం పోరాడిన యోధుడు వంగవీటి మోహనరంగా అని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను మంగళవారం రాయల్ హోటల్ సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి కేక్ కోసి వేడుకలు ప్రారంభించారు. ఇతర నాయకులతో కలిసి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెలంపల్లి మాట్లాడుతూ రంగా స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వంగవీటి రంగా వంటి నేతల నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మౌలానా అజాద్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ అప్పాజీరావు నిర్వహించగా ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్యరెడ్డి, గుడివాడ నరేంద్ర, మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు నాయకులు చాన్, అన్వర్, పిళ్లా రవి తదితరులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో..

కొత్తపేట 51వ డివిజన్‌లోని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద వంగవీటి రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు మరుపిళ్ల తిలక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రజా నాయకుడు మోహనరంగా అని పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ పేర్కొన్నారు. వేళంగణి మాత యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లకమాల రామారావు ఆధ్వర్యాన మంగళవారం 49వ డివిజన్ టైలర్‌పేటలో రంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

చింతలపూడి సత్యనారాయణ వంగవీటి రంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెర్జి భాస్కర్, కుంబా గంగాధర్, కెవిడి నవీన్, దాసరి ఏసు, కల్లేకూరి రాజా, సాధు వాసు, ప్రవీణ్, మధు పాల్గొన్నారు.

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): 34వ డివిజన్ కేదారేశ్వరపేటలో రంగా జయంతి నిర్వహించారు. 2వ లైన్ మసీదు సెంటర్‌లో, మూడో లైన్‌లో జరిగిన వేడుకల్లో నేతలు పాల్గొన్నారు.

రంగా జంక్షన్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వంగవీటి రంగా జంక్షన్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని రంగా విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, పదిలం రాజశేఖర్, వీరంకి సత్యనారాయణ, రెడ్డిపల్లి రాజు, సంకాబత్తుల శరత్, ఎస్ బాబూరావు, నారిండి మౌళి, ఇనపకుర్తి రాము, ముత్తా వాసు, నిరీష్ పాల్గొన్నారు.



51వ డివిజన్‌లో రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మరుపిళ్ల రాజేష్ తదితరులు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ, లకమాల రామారావు

- ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి, ఐక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీఎం రంగా జంక్షన్ సమీపంలోని సంఘ కార్యాలయంలో రంగా నివాళి కార్యక్రమం జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షులు మైలవరపు దుర్గారావు, బొండా నారాయణ రావు, దారపురెడ్డి ఉదయ్‌భాస్కర్ తదితరులు ఉన్నారు.
- వైఎస్సార్ సీపీ 47వ డివిజన్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టీ కూరాకుల నాగ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో నేతలు గోదావరి బాబు, కె.విజయ్‌కుమార్, తింద్ర ఇంద్రకుమార్, రెడపంగు క్రాంతి, ఎ నాగబాబు, సీహెచ్ నాని, దుర్గారావు, రఘు, మహేష్ పాల్గొన్నారు.
- అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వంగవీటి మోహన రంగా జీవిత ఆశయాలు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వీఎం రంగా జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కోఆప్షన్ సభ్యులు అలీం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, చింతా శ్రీను, గెల్లిపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులపై నివేదికలివ్వండి



పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల విగ్రహ నిర్మాణాల్లో జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిరంతరం నివేదికలు ఇవ్వాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ డిజైన్ల ఆధారంగా పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని, సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నామన్నారు. గ్రానైట్ ఫుట్పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయి. పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణంలో రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

మిడోస్ టెన్నిస్ లీగ్‌లో నగర క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: మిడోస్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నగర క్రీడాకారులు కె.గిరీష్, ఎం.ప్రణీత్ సత్తా చాటారు. విశాఖపట్నం భీమిలిలోని మిడోస్ స్పోర్ట్స్ విలేజ్ టెన్నిస్ కోర్టుల్లో ఈ నెల 1,2 తేదీల్లో జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. రూరల్ నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న గిరీష్, ప్రణీత్‌లు డబుల్స్ విభాగంలో ప్రాతినిధ్యం వహించి విన్నర్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. విజేతలను అకాడమి నిర్వాహకులు కె.గోపాలరావు, కోచ్‌లు నగేష్,రవి అభినందించారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ కలరా హాస్పటల్ సమీపంలోని సర్కిల్–1 కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం మొబైల్ కోర్ట్‌ను నిర్వహించారు. సర్కిల్–1 కార్యాలయ పరిధిలోని శానిటరీ సూపర్‌వైజర్లు, పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన 19 మందిపై కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వ్యక్తులు, పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేసిన నేరాలకు న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి రూ.10,480 జరిమానా విధించారు.

నిబంధనలకు విరుద్ధంగా మరోసారి వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ – 1 సుధాకర్, హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లు శివరామప్రసాద్, ఓబేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మొబైల్ కోర్ట్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లోని కిలారి అప్పలస్వామి వీధికి చెందిన జంగం దివ్యవాణి, జాన్సన్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. జాన్సన్‌కు మతిస్థిమితం లేక ఇంటి వద్దే ఉంటుండగా, దివ్యవాణి స్టీల్ షాపులో పని చేస్తుంటుంది. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన జాన్సన్ పక్క వీధిలోని అరుగుపై కూర్చుని ఉన్నాడు. పని నుంచి ఇంటికి వచ్చిన సమయంలో అతను అరుగుపైనే ఉన్నాడు. కొంత సమయం తర్వాత చూడగా అతను కనిపించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జగనన్న ప్రభుత్వంలోనే లౌకిక రక్షణ

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే మరోవైపు లౌకిక ప్రభుత్వంగా మైనార్టీల హక్కులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాపాడుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం 'హర్ దిల్ మే వైఎస్సార్' కార్యక్రమంలో భాగంగా గౌస్‌మొహిద్దిన్ మంగళవారం ఫోర్మెన్ బంగళా ఎర్రకట్ట సమీపంలోని అక్బరీ మసీదు వద్ద స్థానిక ముస్లిం పెద్దలు, మసీదు బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దిన్ మాట్లాడుతూ మసీదు ఇమామ్, మౌసన్ల జీతాలు, షాదీ తోఫా, నవరత్నాల వంటి పథకాలతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మరో పక్క మైనారిటీలకు భద్రతకు ముప్పుగా పరిణమించిన ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో బిల్లు పెట్టి, దాన్ని ఆమోదింపజేసి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ముస్లింలు మద్దతివ్వాలని కోరారు.

అనంతరం సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, మైనారిటీ నాయకులు షేక్ సలీం, సుభాని ఖాన్,షేక్ బడేమియా, షేక్ బాజి షహీద్ తదితరులు పాల్గొన్నారు.



ఫోర్మెన్ బంగళా వద్ద ముస్లింలతో గౌస్‌మొహిద్దీన్

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక 37వ డివిజన్ సచివాలయం ప్రాంగణంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కారణాలతో ఆగిపోయిన వివిధ గుర్తింపుకార్డుల కోసం స్థానికులు భారీగా తరలివచ్చి దరఖాస్తులను అందించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక వ్యాపార వర్గాలు ఉన్న ప్రాంతం 37వ డివిజన్ అన్నారు. వారికి అవసరమైన వివిధ గుర్తింపు ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కేవలం ఒక్క రోజులోనే అన్ని పత్రాలు ఉన్నవారికి ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారని వివరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీఎంసీ, రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా, సమన్వయంతో నిర్వహిస్తున్నాయని వివరించారు. ఈ సభలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం 550 మంది, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం 230 మంది, రేషన్‌కార్డుల కోసం 40 మంది, ఆధార్ కార్డ్ మార్పుల కోసం 97 మంది, ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ఏడుగురు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, ఏపీ జైన్ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, స్థానిక నేతలు జిలానీ, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'జగనన్న సురక్ష'లో భాగంగా విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్‌లోని సచివాలయాల వద్ద కార్యక్రమం జరిగింది.

ఎమ్మెల్యే వెలంపల్లి మొత్తం 1,036 సర్టిఫికెట్లను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి లబ్ధిదారులకు అందచేశారు. వాటిల్లో కుల ధ్రువీకరణకు సంబంధించి 410, ఆదాయ ధ్రువీకరణకు 533 సర్టిఫికెట్లు, రైస్ కార్డులు 10, ఆధార్‌కార్డ్‌లో మార్పులు చేర్పులకు సంబంధించి 79, మరణ ధ్రువీకరణ పత్రం ఒకటి, మూడు హౌస్‌హోల్డ్ స్ప్లిట్ సర్టిఫికెట్లు ఉన్నాయి. కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్ శ్యామల, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, ఎస్కే నజీర్, బి.శాంతి, బొమ్ము మధు, వినోద్ పాల్, బూదాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ బీసీ–బీగా కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ ప్రజలకు 'విశ్వబ్రాహ్మణ బీసీ–బీ'గా కుల ధ్రువీకరణ పత్రంలో పేర్కొనాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం విజయవాడలోని ఏపీ బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.శంకర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోని విశ్వబ్రాహ్మణులు కంసాలి, వడ్ల, ఆచారి, కమ్మర, అంసుల ఇలా పలు పేర్లతో పిలుస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో అదే పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ గెజిట్‌లో కుల ధ్రువీకరణ పత్రంలో ఒక్క విశ్వబ్రాహ్మణ బీసీ–బీ, సీరియల్ నెంబర్ 21 అని మాత్రమే ఉండేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని గతంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, దానిని పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన జస్టిస్ శంకర్ నారాయణ కమిషన్ సభ్యులతో చర్చించి చర్యలు చేడతామని అన్నట్లు శ్రీకాంత్ చెప్పారు.



జస్టిస్ శంకర్ నారాయణకు వినతిపత్రం ఇస్తున్న శ్రీకాంత్

గిరిజన హక్కులు కాపాడుతున్న జగన్

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సాక్షి, అమరావతి: మన్యం ప్రజల హక్కులు, వారి రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అల్లూరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి శంకర్ నాయక్ అంజలిఘటించారు. అల్లూరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అల్లూరి స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి, వారి హక్కుల రక్షణకు విప్లవాత్మక చర్యలు చేపట్టారని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ డెప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, జి.అరుణ, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

విజయవాడ స్పోర్ట్స్: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు విశాల్‌గున్ని, వి.అజిత పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి, అమరావతి: నగరంలోని సీఆర్డీఏ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అదనపు కమిషనర్ కట్టా సింహాచలం, మరో అదనపు కమిషనర్ అలీం బాషాతో కలిసి ఆయన అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్లు చిరంజీవి, డేవిడ్ రాజు, ప్లానింగ్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీ రాణా

7న శాకంబరిగా విజయదుర్గమ్మ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కూరగాయలతో అలంకరణ చేస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆషాఢ సారెను సమర్పించనున్నారన్నారు.

ఆలయంలో అన్నసమారాధన

పెనమలూరు: యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం అన్నమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ భక్తులు చేశారు. దేవస్థానంలో శ్రీ పార్వతీ అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు జరుగుతుండటంతో భక్తులకు అన్నసమారాధన చేశారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె..



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మకు మంగళవారం పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించారు. సమర్పణకు పెద్ద ఎత్తున భక్త బృందాలు, భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు అనుమోలు ఉదయలక్ష్మి బృందం, విజయవాడలోని అవధూత దత్తపీఠానికి చెందిన జేవీ ప్రసాద్‌కు చెందిన వంద మంది భక్త బృందం, కనకలక్ష్మి బృందానికి చెందిన 80మంది, నిరషా బృందానికి చెందిన 60 మంది, డి.లక్ష్మి బృందానికి చెందిన 50 మందితో పాటు పలు భక్తబృందాలు సారెను సమర్పించారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను ఇచ్చి ఆలయ ప్రాంగణంలో ముత్తైదువలు పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని పంపిణీ చేశారు.

రౌడీషీటర్ నగర బహిష్కరణ

విజయవాడ స్పోర్ట్స్: కొత్తపేటకు చెందిన రౌడీషీటర్ పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయిని ఆరు నెలల పాటు నగరం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట రాజగిరి వీధికి చెందిన సాయికుమార్ గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడు. ఆ తర్వాత అతని ప్రవర్తనలోమార్పు రాలేదని, గతంలో మాదిరిగానే నగరంలో అల్లర్లు సృష్టిస్తూ, వివాదాలకు, సంఘ వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్నాడని సీపీ రాణా తెలిపారు. ఈ నేపథ్యంలో నగర ప్రజల శాంతిభద్రతల దృష్ట్యా రౌడీ షీటర్ సాయిని నగరం నుంచి బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు.



రౌడీషీటర్ సాయికుమార్